## క్లుప్తంగా

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: పురుషోత్తపురంలో మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీఎంఎస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### డీఆర్ఎం దృష్టికి రైల్వే సమస్యలు




డీఆర్ఎంతో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్లలో నెలకున్న సమస్యలను ఖుర్దా డివిజన్ రైల్వే మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినట్టు డీఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాష్ తెలిపారు. డీఆర్ఎంను ఖుర్దాలో శుక్రవారం కలిసినట్టు పేర్కొన్నారు. అమృతభారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందిన ఇచ్ఛాపురంలో ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రధాన రైళ్లను నిలుపుదల చేయాలని, రైల్వేస్టేషన్‌కు పశ్చమవైపు ప్రవేశంకల్పిస్తూ టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, ప్లాట్‌ఫారాలపై షెడ్లను పొడిగించాలని కోరినట్టు వివరించారు.

### అభయాంజనేయ సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామంలోని శ్రీరామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. గౌరవ అధ్యక్షుడు మోస వరప్రసాదరావు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.ఎల్.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కాస ముకుంద, కోశాధికారిగా కాస సోమశేఖర్, ఉపాధ్యక్షులుగా కాస వెంకటస్వామి, సహాయ కార్యదర్శిగా బర్రి భూపతి, కార్యవర్గ సభ్యులుగా కాస ఈశ్వరరావు, మద్దు లక్ష్మణరావు, మద్దు వాసుదేవ్, సింగుపల్లి జగన్నాథం, అర్జల జేజేరావు, లండ మురళి ఎన్నికైయ్యారు.

### ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మెరుగైన ఆరోగ్యం కోసం అందరూ కృషి చేయాలని బెలగాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అన్నారు. శుక్రవారం డెంగీ దినోత్సవం సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. డాక్టర్ రాకేష్, డాక్టర్ కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో మాజీ సైనికులు, గ్రామస్తులు

టెక్కలి: పహల్గాం దాడికి ప్రతీకార చర్యగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం టెక్కలి మండలం గంగాధరపేట గ్రామంలో మాజీ సైనికులతో పాటు గ్రామస్తులంతా మద్దతు ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ చేస్తూ జై భారత్, జై జవాన్ నినాదాలు చేశారు.

### భక్తిశ్రద్ధలతో సంతోషిమాతకు పూజలు

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం గ్రామంలో మహిళలు భక్తి శ్రద్ధలతో సంతోషిమాత ఉజ్జీపనను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణ, మేళతాళాల మధ్య సంతోషిమాత రథాన్ని పుర వీధుల్లో ఊరేగించి స్థానిక బహుదానదిలో నిమజ్జనం చేశారు.

# చెప్పుకోలేని వ్యథ..!



నిరుపయోగంగా వనరుల కేంద్రంలోని మరుగుదొడ్డి

- ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగానికి పనికిరాని మరుగుదొడ్లు
- అత్యవసర వేళ సిబ్బందికి తిప్పలు
- వేదన అనుభవిస్తున్న మహిళా సిబ్బంది

నందిగాం:

నందిగాం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రధాన కారణం మరుగుదొడ్లు లేకపోవడమే. కొన్నిచోట్ల ఉన్నా అధ్వాన స్థితిలో ఉండటంతో వినియోగించడానికి వీల్లేకుండా పోయింది. ఫలితంగా సిబ్బంది అత్యవసర సమయంలో పడుతున్న వేతలు అన్నీఇన్నీకావు. ముఖ్యంగా మహిళా సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. కార్యాలయ సిబ్బందే కాక నిత్యం వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే వారు కూడా అత్యవసర వేళ ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. మండలంలోని అన్ని పంచాయతీల్లో గతంలో అధికారులు పర్యటించి ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అవసరమని, ఆరుబయట విసర్జన చేయకూడదని చాటింపులు వేసి మరుగుదొడ్లు కట్టించారు. అయితే ప్రజల్లో మరుగుదొడ్ల వినియోగంపై శ్రద్ధతీసుకున్న అధికారులు తమ కార్యాలయాల్లో ఉన్న మరుగుదొడ్ల, వాటి వినియోగంపై దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉంది. మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి అధ్వాన స్థితిలో ఉంది. అలాగే నిత్యం మహిళలతో నిండి ఉండే వెలుగు కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్డి పూర్తిస్థాయిలో వినియోగానికి పనికిరావడం లేదు. శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ కార్యాలయాన్ని తాత్కాలికంగా స్థానిక ఉన్నత పాఠశాలలోని కొన్ని భవనాల్లో నడుపుతున్నారు. అక్కడ సిబ్బందికి, వివిధ పనుల మీద వచ్చే వారికి మరుగుదొడ్ల సమస్య వెంటాడుతోంది. ఉంది. అలాగే వ్యవసాయ కార్యాలయం, గృహనిర్మాణ కార్యాలయం, విద్యుత్ కార్యాలయం, పశువైద్య కేంద్రం, ఉపాధి హామీ కార్యాలయం, మానవ వనుల కేంద్రం, స్థానిక సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో పాటు పనులపై వచ్చే వారికి మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆరుబయటకు వెళ్లాల్సిందే. దీంతో ఆయా కార్యాలయాల్లో పనిచేసే మహిళా సిబ్బంది తమ బాధను బయటకు చెప్పుకోలేక వేదన అనుభవిస్తున్నారు. మహిళల వేదనను గుర్తెరిగి అధికారులు ఆయా కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం, వాటిని వినియోగించేలా శుభ్రతా చర్యలు తీసుకొని మహిళలకు ఆత్మగౌరవం కల్పించాలని కోరుచున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



**మహిళల బాధలు తీర్చండి**

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళలు అత్యవసర వేళ తీవ్ర ఇబ్బంది పడుతున్నాము. మహిళల బాధను అర్థం చేసుకొని కార్యాలయాల వద్ద మరుగుదొడ్లతో పాటు నీటి సదుపాయం కల్పించాలి. నిత్యం రద్దీగా ఉండే ఉపాధి హామీ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు లేక సిబ్బంది పడే వేదనను అర్థం చేసుకోవాలి.
– బెలమర ఇందిరామణి, సాంకేతిక సహాయకురాలు, ఎంజీఎన్ఆర్‌జీసీ, నందిగాం

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

- జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల విభాగంలో స్వీకరించే వినతులను పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు.



మహిళ సమస్యను వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

## కృష్ణదాస్, తిలక్ పరామర్శ

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులను పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. జర్జంగి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు అనారోగ్యానికి గురికావడంతో అతన్ని పరామర్శించారు. అలాగే రేగులపాడులో పార్టీ సీనియర్ నాయకుడు దుంగ సిమ్మన్న మాస్టార్ భార్య ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాన్ని కృష్ణదాస్, తిలక్ పరామర్శించారు. వీరితో పాటు జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు యర్ర చక్రవర్తి, ఎస్.సత్యరాజ్, చింతాడ అనిరుద్రుడు, ఎస్.వినోద్, ఎస్.జనార్దన్, సోమేష్ ఉన్నారు. అలాగే శ్యామసుందరాపురం గ్రామంలో పార్టీ నాయకుడు పొట్నూరు అప్పలనాయుడు తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాన్ని, టెక్కలిలో సీనియర్ కార్యకర్త కింతలి తిరుమలకుమార్ తండ్రి చిట్టిబాబు చనిపోవడంతో ఆయా కుటుంబాన్ని పార్టీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్ పరామర్శించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్, నాయకులు కె.అజయ్‌కుమార్, బి.కార్తీక్, బి.తులసీరావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి ఉన్నారు.



జర్జంగిలో రామారావును పరామర్శిస్తున్న కృష్ణదాస్, తిలక్ తదితరులు

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కంచిలి: రానున్న ఖరీఫ్ సీజన్‌లో సాగుచేయబోయే పంటల కోసం ప్రకృతి వ్యవసాయ విధానంతో ప్రణాళిక చేద్దామని మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. కేసరపడ గ్రామంలో ఈ మేరకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్, నవధాన్యాలు సాగు, ప్రయోజనాలు వివరించారు. వీవోఏ ఎర్ర భాస్కరరావు, ఐసీఆర్‌పీలు జి.భవానీ, పుష్ప, రోహిణి, మీన, విజయలక్ష్మి, లీడ్ ఫార్మర్స్, రైతులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకుల డిమాండ్

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. టెక్కలిలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నందిగాంలోని అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి అచ్చెన్నాయుడు చొరవ చూపాలని కోరారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. గత 15 ఏళ్లుగా పార్ట్ టైమ్, గెస్ట్ టీచర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి నోటిఫికేషన్‌లో వెయిటేజీ ఇవ్వాలని, ప్రతీ జిల్లాలో బాలురు, బాలికలకు డిగ్రీ కళాశాలలు, పారామెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు మరమతులు చేయించాలని, భవనాల కొరత ఉన్న చోట నూతన భవనాలు నిర్మాణాలు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు ఇవ్వాలన్నారు. అంబేడ్కర్ గురుకులాల్లో సౌకర్యాలు కొరవడుతుండడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండల ప్రాంతాల్లో ఉన్నటువంటి గురుకులాల్లో జనరేటర్ సదుపాయం లేకపోవడం, మినరల్ వాటర్ లేకపోవడం తదితర సమస్యలు వేధిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అంబేడ్కర్ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు మిస్కా కృష్ణయ్య, యడ్ల గోపి, బెలమర ప్రభాకర్, దుర్గాసి గణేష్, చల్లా రామారావు, రాకోటి రాంబాబు, మట్ట పురుషోత్తం, మురళీధర్, కె.దాలయ్య, జె బాబూరావు, టి.నర్సింహమూర్తి, ఆట్ల రాహుల్, శ్రీనివాసరావు, కె.కామేశ్వరావు, పి. ధర్మారావు, కె.దమయంతి, ఎస్.గోపీనాథ్, టి.సూర్యం, బి.తాతారావు, జొన్న సంజీవరావు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు

# సత్యసాయి ప్రేమ ప్రవాహిని ర్యాలీ



టెక్కలిలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం ర్యాలీ

టెక్కలి: భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తి నుంచి బయలుదేరిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం శుక్రవారం టెక్కలి చేరుకుంది. ఈ మేరకు పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యులంతా ప్రేమ ప్రవాహిని రథానికి పూర్ణ కుంభాలతో ఆహ్వానం పలికారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి పీఆర్ రోడ్ మీదుగా, పాత జాతీయ రహదారిపై రోటరీనగర్ –2 వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా చిన్నారులంతా కోలాటం, ఆధ్యాత్మిక భక్తి పాటలతో రథంతో ర్యాలీగా ముందుకు కదిలారు. ర్యాలీలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: పలాసలో శోభాయాత్ర

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సత్యసాయి శోభాయాత్ర ఘనంగా సాగింది. పట్టణానికి చేరుకున్న శ్రీసత్యసాయిప్రేమ ప్రవాహిని దివ్యరథానికి స్థానిక భక్తులు ఊరేగింపుగా వెళ్లి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లా పద్మజ శిష్యబృందం కోలాటాం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలవికాస్ పిల్లలు, భక్తులతో కోలాహలంగా శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరావు, జోనల్ కన్వీనర్ బైరాగి మాస్టర్, జిల్లా పదాధికారులు సకలాభక్తుల అనాది గుప్తా, జామి శ్రీను, కొంతేయ, జగదీష్, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి పాల్గొన్నారు.

## బొలేరోతో ఢీకొట్టి పరార్

కాశీబుగ్గ: పలాస మండలం కంబిరిగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పై ఓవర్ వంతెన కిందన శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌పై వస్తున్న వ్యక్తిని బొలేరో వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బొలేరో డ్రైవర్ పరారైపోయాడు. అతడిని పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సూక్ష్మ రుణ ప్రణాళికతో మేలు

ఇచ్ఛాపురం రూరల్: మహిళా సంఘాల్లోని సభ్యుల సూక్ష్మ రుణ ప్రణాళిక తయారీతో మేలు జరుగుతుందని సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. మహిళా సమాఖ్య కేంద్రంలో సీసీ, వీవోలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రుణం ఎంత, తీసుకున్న రుణాన్ని ఏ రకమైన ఆదాయ వనరుగా మార్చుతారు అనే విషయాన్ని ప్రణాళిక ద్వారా తెలియపర్చవచ్చని అన్నారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలు

కాశీబుగ్గ: దేశంలోనే అతిపెద్ద సహకార బ్యాంక్‌గా గుర్తింపుపొందిన ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ తమ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందజేస్తుందని ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పలాస బ్రాంచ్ సభ్యుల మహాజన సభలో ఆయన మాట్లాడారు. సహకార వ్యవస్థలో తమ బ్యాంక్ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుందన్నారు. అంతర్జాతీయ సంస్థగా ఐక్యరాజ్యసమితి గుర్తించి ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పాల్గొన్నారన్నారు. అనంతరం బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా తీర్చిన లండ పాపారావు, వైశ్యరాజు రూపవతిలను పాలకవర్గం ఘనంగా సన్మానించింది. సమావేశంలో జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, పలాస బ్రాంచ్ మేనేజర్ జగదీష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రసాదరావు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ సమీపంలోని పాత టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచిలికి చెందిన సుశాంత్ ప్రధాన్‌కు తీవ్రగాయాలయ్యాయి. సుశాంత్ ప్రధాన్ ద్విచక్ర వాహనంపై కంచిలి నుంచి బరంపురం వెళ్తూ రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో సుశాంత్ ప్రధాన్ తలకు గాయమైంది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడ్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు ప్రథమచికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. సుశాంత్ భార్య ఫిర్యాదు మేరకు ఇచ్ఛాపురం పట్టణ ఎస్ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేశారు.

## సీనియర్ సెకండరీ టీచర్లను హెచ్ఎంలుగా నియమించండి

కాశీబుగ్గ: సీనియర్ సెకండరీ టీచర్లను ప్రైమరీ హెచ్ఎంలుగా నియమించాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షులు కంచరాన చిన్నబాబు డిమాండ్ చేశారు. పలాసలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. తొమ్మిది రకాల బడుల విధానంలో విద్యావ్యవస్థ సర్వనాశనం అవుతోందన్నారు. 1:45 రేషియో ప్రకారం ఉపాధ్యాయులు మిగిలిపోతున్నారన్నారు. దీనిని సవరించాలని స్కూల్ అసిస్టెంట్లను తీసుకువచ్చి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంలుగా నియమించడం సరికాదన్నా రు. వీరిని హైస్కూల్‌కే పరిమితం చేయాలన్నారు. అలాగే యూపీ స్కూల్లో ఎస్ఏ మ్యాథ్స్, ఇంగ్లిష్ పోస్టులు మంజూరు చేయాలని, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలో(మోడల్ ప్రైమ్ స్కూల్) ప్రధానోపాధ్యాయులుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చిందని గుర్తు చేశారు.



కంచరాన చిన్నబాబు

# కొర్లాంలో దాహం కేకలు



జలజీవన్ మిషన్ ట్యాంకు



చుక్కనీరు రాల్చని కుళాయి

- పైపులైన్‌పై విద్యుత్ స్తంభం ఏర్పాటుతో నీటి సరఫరాకు అంతరాయం
- అవస్థలు పడుతున్న జనం

సోంపేట:

వేసవి వచ్చిందటే పల్లె గొంతు ఎండుతుంది. కొర్లాం గ్రామంలో 15 రోజులుగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజులుగా నీరు అందక పోవడం, బావులు అడుగంటి పోవడంతో దాహం కేకలు పెడుతున్నారు. అధికారులకు సమస్యను తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానిక సర్పంచ్ రాంబుడ్డి రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కొర్లాం గ్రామంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ ద్వారా ట్యాంక్‌లకు నీరు సరఫరా.. దాని నుంచి వీధి కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్ మరమ్మతులు కావడంతో 15 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్నారు.

**విద్యుత్ స్తంభం వేయడంతో..**

జీడిపుట్టుగ కొత్తూరు-సందికొత్తూరు గ్రామాల మధ్యలో జలజీవన్ మిషన్ పైప్‌లైన్ మీద విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో సమస్య తలెత్తింది.కాగా కొర్లాం పంచాయతీలో మరో వారం రోజుల్లో అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొని ఉంది. ఈ సమయంలో పంచాయతీ పరిధిలోని హుఖుంపేట, బ్రాహ్మణ కొర్లాం, గొనకపాడు, లక్ష్మీపురం, నూకలూరు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



**15 రోజులుగా నీటి సరఫరా కావడం లేదు**

కొర్లాం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు 15 రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. డివిజన్ స్థాయి అధికారులకు సమస్య తెలియజేస్తున్నా స్పందించడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించి నీటి సరఫరా చేయాలి.
–రాంబుడ్డి రమణమ్మ, సర్పంచ్, అధికార పార్టీ మద్దతుదారు

**నేటినుంచి నీటిని సరఫరా చేస్తాం**

పైప్‌లైన్‌పై విద్యుత్ స్తంభం వేయడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. మరమ్మతులు పూర్తిచేసి శనివారం నుంచి నీరు సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తాం.
–లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ



## డెంగీపై అవగాహన ర్యాలీ

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శివరంజని పర్యవేక్షణలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి వి.నాగేశ్వరరావు, ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్, ఫార్మసీ ఆధికారి జె.సుబ్రహ్మణ్యం, ల్యాబ్ టెక్నీషియన్ పి.మురళికష్ణ, ఆరోగ్య కార్యకర్త పి.గణేష్‌బాబు పాల్గొన్నారు.
–సంతబొమ్మాళి



## చలివేంద్రాలు ఏర్పాటు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మూడు చోట్ల మున్సిపల్ అధికారులు చలివేంద్రాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. కాశీబుగ్గ బస్టాండ్, పలాస ఆర్టీసీ కాంప్లెక్స్, కేటిరోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పర్యవేక్షించారు. ఎండలో ప్రయాణించే వారు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.
–కాశీబుగ్గ



## వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జూన్ ఐదో తేదీన విజయవాడలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా చలో విజయవాడ వాల్‌పోస్టర్లను సంఘ సభ్యులు మండల కేంద్రం నందిగాంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఉద్యోగులందరూ తరలిరావాలని సంఘ కన్వీనర్ సోమేశ్వరరావు, కార్యక్రమ ప్రతినిధి సంతోష్‌కుమార్ కోరారు.
–నందిగాం